# వేగంగా దవాఖాన భవన నిర్మాణ పనులు

పెద్దేముల్, డిసెంబర్ 17 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న దవాఖాన (ప్రజా ఆరోగ్య కేంద్రం) నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అప్పట్లో పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన రోహిత్ రెడ్డి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. కోటి 56 లక్షలు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. కాగా నిర్మాణ పనుల్లో భాగంగా మొదటగా బేసిమిట్ (పునాది), పుట్టింగులు, లెంత్ భీమ్స్, పిల్లర్లు,రూఫ్ బీమ్స్, స్లాబ్,గోడలు, ప్లాస్టరింగ్,ఎలక్ట్రిసిటీ పనులు ప్రస్తుతం పూర్తి అయ్యాయి. ఇంకా పెయింటింగ్, ఫ్లోరింగ్, ప్లంబింగ్ పనులు పూర్తి కావాల్సి ఉన్నవి. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. దీంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు.మరో వైపు సరియైన వసతులు లేక వైద్య సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత త్వరగా నూతన ప్రజా ఆరోగ్య కేంద్ర భవనాన్ని అందుబాటులోకి తీసుకరావాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



కొనసాగుతున్న ప్రజా ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు

### ఇబ్బందులు దూరం అవుతాయి



పీహెచ్‌సీకి ప్రతి రోజు వంద మందికి తగ్గకుండా రోగులు వస్తుంటారు. సరైన సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడంతో ప్రస్తుతం నూతన దవాఖాన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొత్త దవాఖాన అందుబాటులోకి వస్తే మరింత మెరుగైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నాం. **-అరుణకుమారి, పీహెచ్‌ఎన్**

### త్వరలో మంచి రోజులు...



పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం కింద రూ.కోటి 56 లక్షలు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. వీలైనంత త్వరగా నూతన భవనం అందు బాటులోకి వస్తే మరింత ఉత్సాహంతో వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది. దీంతో రోగులకు,సిబ్బంది మేలు జరుగుతుంది. **-స్వరాజ్, ఏఎన్‌ఎం**

### అందరికీ మేలు..



పాత భవనం శిథిలావస్థకు చేరిన తరుణంలో వీలైనంత త్వరగా నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకరావాలి. ప్రైవేట్ దవాఖానాకు వెళ్లలేని చాలా మంది రోగులు ప్రభుత్వ దవాఖానాలను నమ్ముకొని వైద్యాన్ని పొందుతున్నారు. భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తే అందరికీ మేలు జరిగే అవకాశం ఉంది. **-చాకలి ప్రభు, గ్రామస్తుడు, పెద్దేముల్**

## కామునిపల్లిలో ఉపాధిహామీ గ్రామసభ

కులకచర్ల, డిసెంబర్ 17: మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథ కంలో జరిగిన పనుల వివరాలను తెలుసుకునేందుకు గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ పాల మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామంలో గత ఏడాది జరిగిన ఉపాధిహామీ పథకంలో జరిగిన పనుల వివరాలు, కూలీలు చేసిన పనుల వివరాలను గ్రామ సభలో చదివి వినిపించారు. గ్రామంలో జరిగిన పనుల వివరాలను పరిశీలించేందుకు సోషల్‌ఆడిట్ సీఆర్పీలు గ్రామ సభలో చదివి వినిపించారని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పూడూరు, డిసెంబర్ 17: ఇంట్లో ఎవరు లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయిన ఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గిరి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలం చన్గోముల్ గ్రామానికి చెందిన చాకలి రాజు రోజు మాదిరిగా ఉదయం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంట్లో మంటలు చెలరేగి పొగలు వస్తున్నట్లు పక్కింటి వారు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో ఉన్న రూ. 80వేల నగదు, బట్టలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారుగా రూ.3లక్షకుపై ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రహీస్ ఖాన్ రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

ధారూరు, డిసెంబర్17: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 11:00 లకు నిర్వహిస్తున్నట్లు ఎంపీవో షఫీఉల్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం శ్రీ శక్తి భవనంలో ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామ, మండల స్థాయి అధికారులు, హాజరు కావాలని తెలిపారు.

## ఘనంగా ప్రపంచ పెన్షనర్స్‌డే..



మాట్లాడుతున్న జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హారతీ ద్వారకానాథ్

వికారాబాద్, డిసెంబర్ 17: ప్రపంచ పెన్షనర్స్‌డే పురస్కరించుకొని ఆదివాం వికారాబాద్ పట్టణంలోని సత్యసాయి జ్ఞాన కేంద్రంలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హారతి ద్వారకనాథ్ మాట్లాడుతూ పెన్షనర్లు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనంచేయాలన్నారు. రోజూ 20 నిమిషాలు నడక, ప్రాణయామము, ధ్యానము ఏదో ఒకటి చేయాలన్నారు. రేడియోను తన మిత్రుడిగా చేసుకొని వార్తలు, నాటికలు, బుర్రకథలు వినాలని సూచించారు. పెన్షన్ బహుమానం కాదని, గతంలో వారు చేసిన సేవలకు చెల్లింపు అని తెలిపారు. కార్యదర్శి నర్సింహారెడ్డి మాట్లాడుతూ నగదు రహిత వైద్య చికిత్సలు, బస్సుల్లో 50%రాయితి విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాలన్నారు. అనంతరం 73 సంవత్సరాలు దాటిన విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జూకారెడ్డి, వికారాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ బందెప్ప గౌడ్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు పాపయ్య, సతీష్ చంద్రవిటోభ, అంబదాస్, బెంజమిన్ మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పీఆర్టీయూ ఆర్థిక సాయం



సురేశ్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

కులకచర్ల, డిసెంబర్ 17: కామునిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేశ్ నవంబర్ 30న క్యాన్సర్ బారిన పడి మృతి చెందాడు. ఆదివారం పీఆర్టీయూ రాష్ట్ర శాఖ నుంచి రూ. లక్ష చెక్కును ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ , రాష్ట్ర నాయకులు పరంధాములు, దోమ అమర్నాథ్, పెంటయ్య, నర్సింహులు, వెంకటయ్య, కులకచర్ల మండల పీఆర్టీయూ అధ్యక్షుడు వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు గులాం, మండల బాధ్యులు శేఖర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

### మరో ముగ్గురికి తీవ్రగాయాలు

మర్పల్లి, డిసెంబర్ 17: రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురకి తీవ్రగాయాలైన ఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోమిన్‌పేట్ మండలం మొరంగపల్లి గ్రామానికి చెందిన పులిగారి నర్సింహులు శనివారం మర్పల్లి మండలంలోని కోట మర్పల్లి గ్రామంలోని బంధువుల వద్దకు వెళ్లి రాత్రి 8: 30 ప్రాంతంలో తుడుం మొల్లయ్యతో కలిసి మర్పల్లి వెళ్తుండగా ఆదే గ్రామానికి చెందిన పోచారం రాజు, శ్రీనివాస్ ఇద్దరు మర్పల్లి నుంచి కోటమర్పల్లి బైక్‌పై వస్తుండగా ఢీకొన్నాయి. దీంతో తీవ్రగాయాలైన నలుగురిని గమనించిన స్థానికులు మర్పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. డాక్టర్లు పరీక్షించగా అప్పటికే నర్సింహులు మృతి చెందినట్లు తెలిపారు. మిగతా ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి

కులకచర్ల, డిసెంబర్ 17 : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చెరువుముందలితండాలో జరిగింది. కులకచర్ల ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం కులకచర్ల మండల పరిధిలోని చెరువుముందలితండాకు(కె) చెందిన మూడావత్ మాణిక్యమ్మ(68) చెరువుముందలితండాలో వారి ఇంటి పక్కన పెండ్లి ఉన్నందున ఇంట్లోకి గ్రిల్స్ తాకుతూ విద్యుత్ వైర్లు తీసుకున్నారని వైరు గ్రిల్స్‌కు తగులడంతో గ్రిల్స్‌ను మాణిక్యమ్మ పట్టుకొడంతో షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు


పరిగి, డిసెంబర్ 17: వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని వడ్డెర సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను వడ్డెర సంఘం పరిగి నియోజకవర్గం అధ్యక్షుడు మణి, ప్రధాన కార్యదర్శి అంజిలయ్య, యాదయ్య, ఆశన్న, రాములు, జంగన్న, శేఖర్ తదితరులు కలిసి సన్మానించారు. అనంతరం వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో చర్చించాలని వారు కోరారు.

### పార్టీ నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



వికారాబాద్, డిసెంబర్ 17 : వికారాబాద్ మండల పరిధిలోని గోధుమగూడ గ్రామ సర్పంచ్ అనితా గౌడ్ భర్త, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్తయ్య గౌడ్ హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుక్ను వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఆదివారం దవాఖానకు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు.

## లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్

పరిగి, డిసెంబర్ 17: కార్యకర్తలు అధైర్యపడొద్దని, రాబోయే స్థానిక సంస్థలు, లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూనేటి మారుతి కిరణ్, సీనియర్ నాయకులు కరణం ప్రహ్లాద్ రావు పేర్కొన్నారు. ఆదివారం పరిగిలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఏవైనా పొరపాట్లుంటే సరిదిద్దుకొని రాబోయే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేద్దామన్నారు. లోక్‌సభ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ సత్తా చాటుదామని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గణపురం వెంకటయ్య, రవిగౌడ్, హరికృష్ణ పాల్గొన్నారు.

## గుప్తనిధుల తవ్వకాల కలకలం



యాలాల, డిసెంబర్ 17: గుప్తనిధుల కోసం పురాతన శివలింగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన యాలాల మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామ శివారులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. విశ్వనాథ్‌పూర్ గ్రామ శివారులో ఉన్న వెంకట్ రెడ్డి తన పొలం వద్దకు వెళ్లగా శివ లింగాన్ని ధ్వంసం చేసి పక్కకు పడేసినట్లు గమనించాడు. వెంటనే గ్రామస్తులకు విషయాన్ని తెలుపడంతో పాటు పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.